క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంకుడు గుంత నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ పుణ్యదాస్ తెలిపారు. ఇంకుడు గుంతలకు రూ 4,300 మంజూరు చేస్తామన్నారు. ఆరు ఫీట్ల పొడవు, వెడల్పు, లోతుతో గుంత తీసి ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి అవసరాలకు వినియోగించిన మురికి నీరు ఇంకుడు గుంతద్వార భూమిలో ఇంకుతుందని దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు జాబ్ కార్డు, ఆధార్‌కార్డుతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేదా ఉపాధిహామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

చివరి గింజ వరకు కొంటాం
తహసీల్దార్ దత్తరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దత్తరెడ్డి

రేగోడ్(మెదక్): వరి ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని తహసీల్దార్ దత్త రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, 2,,571 బస్తాలను రైస్‌మిల్లుకు తరలించామని, ఇంకా 380 బస్తాలు తరలించేందుకు సిద్ధంగా ఉంచామని ఐకేపీ సీసీ అనసూయ చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం
జిల్లా క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి



క్రీడా సామగ్రి అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ఆటలతో మానసిక ఉల్లాసం కల్గుతుందని జిల్లా క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి గోమారంలో నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. వేసవి శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు యువత వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి వచ్చిన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు మహిపాల్‌రెడ్డి, శైలేందర్‌గౌడ్ ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కల్గించవద్దు



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరిధాన్యం, జొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయా మిల్లుల్లో రైసు మిల్లర్లకు ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఆందోళన చెందవద్దని సూచించారు.

ఉపాధ్యాయుల బడిబాట



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోనే మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని మద్దుల్‌వాయి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ముత్తాయికోట, మద్దుల్‌వాయి గ్రామాలలో విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాల కంటే మంచి విద్యనందించేందుకు వసతులు కల్పిస్తుందని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నందరామ్, రఘుబాబు ఉన్నారు.

శిఖం భూముల అన్యాక్రాంతం

- చెరువులు, కుంటల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- ఆయకట్టుకు నీరందని పరిస్థితి



చండీ చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చెరువులు, కుంటలకు సంబంధించిన శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. దీంతో నీటి నిల్వలు తగ్గిపోయి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా 150 చెరువులు, కుంటలకు సంబంధించి శిఖం భూములు ఉన్నప్పటికీ వాటి సంరక్షణ చేపట్టాల్సిన ఇరిగేషన్ శాఖ నిద్ర మత్తులో ఉండడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

శిఖం భూములకు పట్టాలు

మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల శిఖం భూములు పట్టాలుగా మారాయి. ఆ భూములు అమ్మకాలు కొనుగోళ్లు సైతం జరుగుతున్నాయి. ఇట్టి భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టితో నింపి భూమిని ఎత్తు చేయడంతో పాటు బోరుబావులు తవ్వి రెండు పంటలు సాగుచేస్తున్నారు. దీంతో చెరువులు, కుంటల్లో నీరు నిల్వ ఉండక ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటుక బట్టీల ఏర్పాటు

మండలంలోని కొత్తపేట పూర్వ పంచాయతీ పరిధిలోని కుంటల్లో దర్జాగా పలువురు ఇటుక బట్టీలు



పల్లెకుంట శిఖంలో తూంకు ఆనుకుని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్వహిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. శిఖం భూముల్లో నిత్యం ఏదో ఒక చోట ఇష్టారాజ్యంగా జేసీబీ, హిటాచ్‌లతో తవ్వకాలు చేస్తుండటం వల్ల ఏర్పడిన భారీ గుంతల వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. చిన్నగొట్టిముక్ల గ్రామంలోని పలు కుంటలు, చెరువుకు సంబంధించి భూములు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శిఖం భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సి అవసరం ఉంది.

> **నోటీసులు ఇస్తాం**
>
> శిఖం భూములను కబ్జా చేసిన వారిని గుర్తించి నోటీసులు ఇస్తాం. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు, కొనుగోలు జరిగిన వాటిని పరిశీలించి శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. శిఖం ఇటుక బట్టీల నిర్వహణ, మట్టి తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం.
>
> – బుచ్చిబాబు, ఇరిగేషన్, డీఈ

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని దూప్‌సింగ్ తండాలో బుధవారం నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తండావాసులతో కలిసి నృత్యం చేస్తూ అందరిని అలరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



తండావాసులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

ఇరుకైన రోడ్డుతో ఇక్కట్లు

- తరచూ ప్రమాదాల బారిన ప్రయాణికులు
- రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్



గాంధీ చౌరస్తా వద్ద ఇరుకుగా మారిన చేగుంట మెదక్ రోడ్డు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని గాంధీ చౌరస్తా వద్ద మెదక్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మెదక్, వైపునకు రామాయంపేట, హైదరాబాద్ వైపునకు వెళ్లే ప్రయాణికులు గాంధీ చౌరస్తా సమీపంలో ఉన్న బస్టాండ్లలోనే బస్సుల కోసం నిలబడతారు. దీంతో గాంధీ చౌరస్తా నిత్యం రద్దీగా ఉండటంతో వాహనాల రాకపోకల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మెదక్ రోడ్డులో ఉన్న రైల్వేగేటు తెరిచిన సమయంలో మెదక్ వైపు నుంచి ఎక్కువ వాహనాలు వస్తుంటాయి. రోడ్డుపైనే పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకోగా.. బస్సుల కోసం జనాలు హడావిడిగా వెళుతూ వాహనాలు ఢీకొనే పరిస్థితి ఏర్పడింది. మంగళవారం సాయంత్రం బస్సు కోసం రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్న శిరీషను లారీ ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఆర్ అండ్‌బీ అధికారులు గాంధీ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రసాయనాల వాడకాన్ని తగ్గించాలి

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



కాగజ్ మద్దూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాగజ్‌మద్దూరు, జక్కపల్లి గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. రసాయన వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. భూములకు అనుగుణంగా నేల పరీక్షలు చేయించుకుని విత్తనాలు చేసుకోవాలని చెప్పారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మశ్రీ, గీత, సవిత, గాయత్రి, ఏఓ దీపిక, ఏఈఓ చంద్రవేణి, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

నార్సింగి మండల బీజేపీ కార్యవర్గం



నార్సింగి బీజేపీ మండల కార్యవర్గం సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల బీజేపీ కార్యవర్గం బుధవారం ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు సత్యపాల్‌రెడ్డి, లింగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నూతన కార్యవర్గం ప్రకటించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా రాకేష్, ప్రశాంత్, నాగరాజురెడ్డి, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణ్, శ్రీనివాస్, కోశాధికారిగా గురుపాదం, కార్యదర్శులుగా నవీన్, డాక్టర్ నర్సింహులు, సరిత, గిరీష్, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తిలో హనుమాన్ దేవాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నయీముద్దీన్, మొహమ్మద్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ చారి, జనార్దన్, కృష్ణాగౌడ్, ఖైసర్ పాల్గొన్నారు.



ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

క్రికెట్ విజేత రెవెన్యూ జట్టు



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ (రెవెన్యూ), ఎంపీడీఓ కార్యాలయాల సిబ్బంది మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ అఫీషియల్ క్రికెట్ పోటీలలో విజేతగా తహసీల్దార్ కార్యాలయం టీమ్ జట్టు విజయం సాధించింది. విజేతలకు తహసీల్దార్ మన్నన్ క్రికెట్ కప్‌ను అందించారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

- ఎనిమిది మందికి మిగిలింది ముగ్గురే..
- ఇద్దరు సెలవుపై.. ముగ్గురు డిప్యూటేషన్‌పై..
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దుస్థితి
- మెరుగైన సేవలందక జనం సతమతం



విధుల్లో కేవలం ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు



ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ

నర్సాపూర్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది కొరత సమస్యతో సతమతమవుతున్నారు. రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా.. కార్యాలయంలో తగిన సిబ్బంది ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కార్యాలయంలో ఎనిమిది మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. సబ్ రిజిస్ట్రార్ నీలిమా, సీనియర్ అసిస్టెంట్ జావిద్ సుమారు పది నెలలుగా దీర్ఘకాలిక సెలువులో ఉన్నారు. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు ఆరు నెలల క్రితం డిప్యూటేషన్‌పై సంగారెడ్డికి వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్లు అన్సారీ, సుచరిత, అటెండర్ ప్రవీణలు విధులు నిర్వహిస్తున్నారు. అన్సారీకి అదనంగా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. కాగా, ఒకవైపు సిబ్బంది సమస్య వేధిస్తున్నా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం కూడా లేదు. కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

> **సిబ్బంది లేక ప్రజల పాట్లు**
>
> కార్యాలయంలో సరైన సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు, ప్లాట్లు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ పనుల కోసం నిత్యం జనం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. అయితే.. పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో తమ పనులు సకాలంలో పూర్తి కావడం లేదని వారు వాపోతున్నారు. అన్ని డాక్యుమెంట్లు సమర్పించినా సరిపడా ఉద్యోగులు లేనందున రిజిస్ట్రేషన్ పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. జనవరి నుంచి ఏప్రిల్ వరకు సుమారు రూ.80లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిసింది. అయినా.. ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. ఈ విషయమై ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అన్సారీని వివరణ కోరగా.. ప్రజలకు వీలైనంత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పాదచారులను ఢీకొన్న జీపు

పాపన్నపేట(మెదక్): కాలి నడకన వెళుతున్న భార్యాభర్తలను వెనుక నుంచి అటవీశాఖ అధికారుల జీపు ఢీకొంది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని అర్కెల గేటు వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజ్యా తండాకు చెందిన కమ్లీ,సేవ్యా దంపతులు అంగడి వెళ్లేందుకు పాపన్నపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న అటవీశాఖ అధికారుల జీపు ఢీకొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కమ్లీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



నర్సాపూర్ రూరల్: విద్యుత్ షాక్‌తో పాడి గేదే మృతి చెందింది. ఈ సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దండు వెంకటయ్య పాడి గేదె మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాద వశాత్తూ షాక్‌కు గురై మత్యువాత పడింది. రెండు పూటలా పాలిచ్చే గేదె ధర సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి బాసట



బాల్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

పాపన్నపేట(మెదక్): ఇటీవల గుండె పోటుతో మరణించిన బాల్య స్నేహితుడి కుటుంబానికి తోటి క్లాస్‌మేట్స్ ఆర్థిక సాయం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన పాల్యా బాల్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య కళావతి, కొడుకు, కూతురు ఉన్నారు. ఇటీవల బాల్య గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి చదివిన 1991 బ్యాచ్ పొడిచన్‌పల్లి విద్యార్థులు తమ వంతుగా రూ.44 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో వై.సుదర్శనం, ఎస్.సుదర్శనం, ,సిద్ధిరాం రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత



పిల్లుట్లలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాలల సంరక్షణ విభాగం అధికారులు సరిత, శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, అక్రమ దత్తత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, యువతుల పై జరిగే దాడులపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన అనంతరం ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని మైనర్ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే చట్టరీత్య వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఆడపిల్లలపై దాడులు, బలవంతపు పెళ్లిళ్లు, ఇతర సమస్యలపై హెల్ప్‌లైన్ నంబరు 1098 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేట, రాజిపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈనెల 15న ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సాయికుమార్ తెలిపాలు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉన్న చెట్టకొమ్మల తొలగించి పనులు చేస్తున్నామని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు దొంతి రథోత్సవ వేడుకలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ఆలయ పూజారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మోహిణి అవతారంలో పల్లకిసేవ ఊరేగింపు చేపట్టారు. గురువారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం వేడుకలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త సంజయ్‌రెడ్డి తెలిపారు.

◆ 'పేట'లో భారీ వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

◆ నేడు మారుతికారు వేలం

మెదక్ మున్సిపాలిటీ: మద్యం కేసులో పట్టుబడిన మారుతి ఆల్టో కారును గురువారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

◆ గాలివాన బీభత్సం



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో చీకట్లు అలుముకున్నాయి. ధాన్యం కుప్పలు కొంతమేర తడిచిపోయాయి. మెదక్– బొడ్మట్‌పల్లి రోడ్డుపై 11 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే సీతానగర్‌లో మంగళవారం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు

శివ్వంపేట(నర్సాపూర్): అకారణంగా కార్మికులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ శివారులో ఉన్న స్టాండర్డ్ ప్లోరా పరిశ్రమలో ఈ నెల 11న విధులు ముగించుకుని నడుచుకుంటూ వెళ్తున్న కార్మికులపై గుమ్మడిదల మండలం అనంతారం గ్రామానికి పలువురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు చెప్పారు. బుధవారం పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ కిషోర్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



యాదగిరి (ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కర్నాల్‌పల్లికి చెందిన గొల్ల యాదగిరి(50) భార్య కిష్టమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై తూప్రాన్‌లో బంధువుల ఇంటికి వెళుతున్నాడు. తిరుగు ప్రయాణంలో మాసాయిపేట మండలం బొమ్మారం గేటు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన యాదగిరిని హైదరాబాద్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.